క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామన్నపేట : రామన్నపేట 132/33కేవీ సబ్ స్టేషన్‌లో 33/11 కేవీ లక్ష్మాపురం ఫీడర్ బ్రేకర్ మరమ్మతుల కారణంగా మంగళవారం మండలంలోని లక్ష్మాపురం, తుమ్మలగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు విద్యుత్ ఏఈ కోటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వలిగొండ : రామన్నపేట సబ్‌స్టేషన్‌లో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పడిన మరమ్మతుల కారణంగా మంగళవారం మండలంలోని లింగరాజు పల్లి, మల్లేపల్లి, దాసిరెడ్డిగూడెం, సుంకిశాల ,లోతుకుంట, అక్కంపల్లి, నాతాళ్ల గూడెం, మాందాపురం, రెడ్ల రేపాక, పైల్వాన్‌పురం గ్రామాల పరిధిలో వ్యవసాయ బావులకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం


గోదాదేవి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

రామన్నపేట : మండలకేంద్రంలోని చెన్నకేశవ ఆలయంతోపాటు సిరిపురం శ్రీ సీతా రామాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుప్పావైని పఠించి గోదాదేవి అమ్మవారికి పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయచైర్మెన్ వనం ఉపేందర్, కొత్తమాసు మధు, రాపోలు రాజశేఖర్, కసిరెడ్డి ఇంద్రారెడ్డి, ఈతాపుల రా జు, కోట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలో ఆయాన్ష్ భార్గవ్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పబ్బు రాజు, కౌన్సిలర్లు ఎండీ.బాబాషరీఫ్, కొయ్యడ సైదులు, షాదీఖానా చైర్మన కరీం, నాయకులు పాశం సంజయ్‌బాబు, మొగుదాల రమేష్, ఇంద్రసేనారెడ్డి, కంచరకుంట్ల రాంరెడ్డి, నిర్వాహకులు మురళి, రిజ్జు, భానుప్రకాష్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ భక్త మార్కండేయస్వామి ఆలయానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ అన్న సత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు దీకొండ జోగయ్య, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్, కోశాధికారి బడుగు మల్లేష్, కార్యవర్గ సభ్యుడు గంజి సూర్యనారాయణ, కోడూరు రాజు, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి దీకొండ వెంకటేష్, కోశాధికారి మెరుగు మధుసూదన్, ఉపాధ్యక్షులు మండల శ్రీనివాస్, ఎర్రగుంట్ల శేఖర్, సహాయ కార్యదర్శి ఎక్కలదేవి భాస్కర్, కుసుమ రాజు, కార్యవర్గ సభ్యులు గుర్రం వసంత, గొర్ల జ్యోతి, భీమనపల్లి లక్ష్మీనారాయణ, మెరుగు అనిల్, వల్లకాటి సురేష్, మిర్యాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న అధికారులు

వలిగొండ : మండలంలోని లోతుకుంట గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలోని వసతి గృహంలోని విద్యార్థినులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, ఎంఈఓ భాస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ రైస్ ఉన్నీసా బేగం, ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు వినతి

భువనగిరి : ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ఒత్తిడి చేస్తున్న మాంటిస్సోరీ పాఠశాలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ భువనగిరి శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏబీవీపీ వివేకానంద జోన్ ఇన్‌చార్జ్ పవన్ మాట్లాడారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు రాయనిస్తామని విద్యార్థులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నపురం నీలకంఠ, హర్షవర్ధన్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

- మోత్కూరు-కూరెళ్ల రోడ్డుపై కనిపించని సూచిక బోర్డులు
- మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు

మోత్కూరు : మోత్కూరు మండల కేంద్రం నుంచి ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న మూలమలుపులు.. ప్రమాదాలకు నిలయంగా మారాయి. మోత్కూరు నుంచి పనకబండ, పుల్లాయిగూడెం మీదుగా కూరెళ్ల వరకు 11కి.మీ పరిధిలో 33మూల మలుపులు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేదాకా కనిపించక ఢీకొన్న ఘటనలు అనేకం ఉన్నాయి. మూల మలుపుల వద్ద వాహనాలు అదుపుతప్పి ప్రాణాలు పోతున్నా, క్షతగాత్రులుగా మారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీంతో ఈ రోడ్డు వెంట ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు..

ప్రమాదకర మలుపుల వద్ద వాహనదారులను హెచ్చరిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వాహనాలు మూలమలుపు వద్ద అదుపు తప్పి పడిపోతున్నారు. ఈ ప్రమాదాల్లో పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోగా, మరెందరో గాయాలపాలయ్యారు. గత కొన్నేళ్ల క్రితం పుల్లాయిగూడెం గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెండ్లి ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు రాఘవాపురం గ్రామస్తులు మృతి చెందారు. పాలడుగు గ్రామానికి చెందిన కొంపెల్లి ముత్తయ్య గత ఏడేళ్ల మూల మలుపు వద్ద అదుపు తప్పి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నెల రోజుల క్రితం మోత్కూరు పట్టణానికి చెందిన అన్నెపు వెంకన్న ముత్యాలమ్మ గుడి సమీపంలో ఉన్న మలుపు వద్ద లూనా అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో రోడ్డుకు ఇరువైపులా జంగల్ కటింగ్ చేయించాలని రోడ్డుపై అక్కడక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


మోత్కూరు-కూరెళ్ల మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

రోడ్డు వెడల్పు చేయాలి



మోత్కూరు-కూరెళ్ల రోడ్డులోని మూల మలుపుల వద్ద రోడ్డును వెడల్పు చేయాలి. మూల మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో ఈ రోడ్డుపై భయపడుతూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– వేముల భిక్షం, కూరెళ్ల

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. మూల మలుపులు ఎన్ని ఉన్నాయో పంచాయతీరాజ్ శాఖ పరంగా ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేయించాలి. ఒక మూల మలుపు నుంచి మరో మూల మలుపు వరకు రోడ్డుకు ఇరువైపులా రైతుల స్థలానికి పరిహారం చెల్లించి రోడ్డు వెడల్పు చేయాలి. అప్పుడే ప్రమాదాలను శాశ్వతంగా నివారించొచ్చు.

– లోతుకుంట నాగార్జున, పనకబండ

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

భూదాన్‌పోచంపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో జరిగిన ఆ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం 146 బూత్ నూతన అధ్యక్షుడిగా ఈడమోని అంజి, కార్యదర్శిగా కుక్కలి లింగస్వామి, 147 బూత్ అధ్యక్షుడిగా దొరగండ్ల లింగస్వామి, కార్యదర్శిగా కుక్కలి శివప్రసాద్, సభ్యులుగా గొలనుకొండ కృష్ణ, కారింగు శ్రీకాంత్, పాడుగు భాను, కొండమడుగు నర్సింహ, గొలనుకొండ శేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మాధవి, పట్టణ అధ్యక్షుడు డబ్బీకార్ సాహేశ్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, చేనేతసెల్ జిల్లా కన్వీనర్ గంజి బస్వలింగం, రుద్ర చక్రపాణి, పట్టణ ప్రధానకార్యదర్శి గొలనుకొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

దాతల సహకారం అభినందనీయం

బొమ్మలరామారం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని డీఈఓ సత్యనారయణ అన్నారు. మాజీ జెడ్పీటీసీ చిమ్ముల నర్సింహ రెడ్డి వర్ధంతి సందర్బంగా ఆయన కుమారుడు మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్యారారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సమకూర్చిన స్పోర్ట్స్ డ్రెస్, షూ,టై బెల్ట్‌లు, 24 డెస్క్ బెంచీలను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రోజారాణి, పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్‌నర్సింహ, మచ్చ శ్రీనివాస్ గౌడ్, పోలగొని వెంకటేష్ గౌడ్, గొడుగు చంద్రమౌళి,మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, కట్టా శ్రీకాంత్ గౌడ్, జూపల్లి భరత్, కూర వెంకటేష్,హెడ్మాస్టర్ హైమావతి, శ్రీహరి అయ్యంగార్, పెసరు లింగారెడ్డి, ఉపేంద్ర, రాజు, పద్మ, గిరిధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు,మనుక రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌లు అందజేస్తున్న డీఈఓ సత్యనారయణ, మాజీ ఎంపీపీ సుధీర్ రెడ్డి

పోచంపల్లిని గ్రామపంచాయతీగా మార్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న తడక రమేశ్

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లిని గ్రామపంచాయతీగా మార్చాలని తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక రమేశ్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఆవరణలో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పోచంపల్లి, ముక్తాపూర్, రేవనపల్లిలను గ్రామపంచాయతీలుగా పునరుద్ధరించాలని ప్రజా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా పోచంపల్లిలో రేవనపల్లి, ముక్తాపూర్ గ్రామాలను విలీనం చేసి మున్సిపాలిటీగా మార్చిందన్నారు. దీంతో భూదానోద్యమం, చేనేతకు పుట్టినిల్లయిన పోచంపల్లి గ్రామం తన అస్థిత్వాన్ని కోల్పోయిందన్నారు. మున్సిపాలిటీగా మార్పు చేయడం వల్ల జాతీయ ఉపాధిహామీ పథకం కోల్పోయి వందలాది కూలీలకు పనిలేకుండా పోయిందన్నారు. మున్సిపాలిటీలో పన్నుల భారంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్నం కృష్ణకుమార్, అఖిలపక్ష నాయకులు భారత లవకుమార్, డబ్బీకార్ సాహేశ్, కొండమడుగు రాజు, బాలచంద్రంగౌడ్, చింతకింది రమేష్, ఏలే భిక్షపతి, చిక్క కృష్ణ, బైరు రామాంజనేయులు, కుంటోళ్ల మహేశ్, కర్నాటి పురుషోత్తం, బస్వలింగం, వేశాల మురళి, భారత భూషన్, గజ్జెల రామకృష్ణ, బోడ దయానంద్, బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఆత్మకూరు(ఎం) : ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్మికులు


గుండాల : ఎంపీడీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

ఆత్మకూరు(ఎం): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ ఉద్యోగుల కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కూరెళ్ల కిష్టయ్య అన్నారు. పంచాయతీ కార్మికుల తలపెట్టిన సమ్మె నోటీసును సోమవారం ఎంపీడీఓ రాములు నాయక్‌కు అందజేశారు. ఈ నెల 17న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోముల స్వామి, కార్యదర్శి ఇంద్రపెల్లి జ్ఞానేశ్వర్, కోశాధికారి, ఎస్. రమేష్, కార్మికులు పత్తెపురం సుధాకర్, తాల్లపెల్లి నర్సయ్య, వేవల్ల స్వామి, పత్తెపురం కిష్టయ్య పాల్గొన్నారు.

గుండాల: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం మండల పరిషత్ సూపరింటెండెంట్ దేవేందర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పరశురాములు, ఎల్లయ్య, రామచంద్రయ్య, సురేందర్, రాములు, గిరి, మల్లయ్య, ఇందిరమ్మ పలువురు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోశాల కూల్చివేతపై డీజీపీ స్పందించాలి

భువనగిరి : ఆలేరు మండలం బహదూర్‌పేట గ్రామంలో సారబుడ్ల సావిత్రమ్మ లక్ష్మారెడ్డి నిర్వహిస్తున్న గోశాల కూల్చివేత ఘటనపై డీజీపీ స్పందించాలని రామరాజ్యం వ్యవస్థాపకుడు త్యాగరాజు బంటు వీరరాఘవరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోశాల కూల్చివేత ఘటన పై యాదగిరిగుట్ట రూరల్ సీఐ, ఆలేరు ఎస్సైలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దోషులను శిక్షించాల్సిన పోలీసులు బాధితులను ప్రివెంట్ అరెస్టు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. గోశాల కూల్చివేతకు పాల్పడిన వారికి సపోర్టు చేస్తున్న పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రామరాజ్యం ఇందూరు బాధ్యులు సాయినాథ్, నాయకులు జంపాల దశరథ, దయ్యాల సంపత్, ఆనంద్, గణేష్, రమేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, భాస్కర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల మైదానం అభివృద్ధిపై నిర్లక్ష్యం


ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానాన్ని అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తుందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. జూనియర్ కళాశాల మైదానాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కళాశాల మైదానంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి చొరవతో ఏజీఐ గ్లాస్ ప్యాక్టరీ, సీఎస్ఆర్ ఫండ్ నుంచి కళాశాల ఆవరణలో ఉన్న గుట్టను తవ్వించి చదు ను చేయడంతో పాటు ఫుట్ బాల్ మైదానాన్ని నిర్మించినట్లు తెలిపారు. గతంలో మైదానంలో వాకింగ్, రన్నింగ్‌తో పాటు ఇతర క్రీడల నిర్వహణ కోసం నివేదిక పంపినట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న మైదానాన్ని అభివృద్ధి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, కోల్పుల అమరేందర్, అంజనేయులు, ర్యాకల శ్రీనివాస్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, రఘునాథ్, స్వామి, మహేష్, ఎక్బాల్ చౌదరి, మజార్ పాల్గొన్నారు.

మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

మోత్కూరు : మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం మోత్కూరులోని హైస్కూల్ చౌరస్తా వద్ద మోత్కూరును రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోత్కూరు మండలానికి అనుసంధానంగా ఆత్మకూరు(ఎం), గుండాల, మూటకొండూర్, అడ్డగూడూరు మండలాలతో కలిపి మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకర్త అర్ధ ప్రతాప్‌రెడ్డి, నాయకులు బిరుదు శ్రీనివాస్, పల్లగొర్ల నర్సింహ, సిరిగిరి మస్తాన్, ఎర్రవెల్లి ముత్తయ్య, పిట్టల చంద్రయ్య, పోతరబోయిన నర్సింహ, బోడ యాకు, తీగల నర్సింహ, పురుగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

ఆలేరురూరల్: గురుకుల హాస్టళ్లలో నూతన డైట్ విధానం అమలుతో పాటు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు జి.నవీన్‌కుమార్, పవన్, నితిన్, రంజిత్, నరేష్, చరణ్, ప్రణయ్, యశ్వంత్, మని చందు, అజీమ్, భానుప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెవిలో పూలు పెట్టుకుని సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన


కలెక్టరేట్ ఎదుట చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భువనగిరిటౌన్ : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలో ఏడో రోజు సోమవారం చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. సీఎం రేవంతర్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చేవరకు నిరవధిక దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

భూ నిర్వాసితుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వినతి

భూదాన్‌పోచంపల్లి : గౌరెల్లి – భద్రాచలం జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ సీపీఎం మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి, నాయకులు గూడూరు అంజిరెడ్డి, పగిళ్ల లింగారెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాదం విష్ణు, మంచాల మధు, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, నెలికంటి జంగయ్య, పత్తి భిక్షపతి, సామ జంగారెడ్డి, బుగ్గ లక్ష్మయ్య పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

మెరుగైన వైద్య సేవలందించాలి

చౌటుప్పల్ : ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని మందుల నిల్వలు, రికార్డులు, రిజిష్టర్‌లను, పరిశీలించారు. వైద్యులు సమయపాలన పాటించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వైద్య సేవలకు ఆటంకం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ జన్మదిన వేడుకలు

మోత్కూరు : మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ నివాసానికి పలువురు నాయకులు వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తె లిపారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్, పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీను, మాజీ మార్కెట్ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, గజ్జి మల్లేష్, సోంమల్లు, మాజీ సర్పంచ్‌లు బయ్యాని పిచ్చయ్య, తిరుమలేష్, మల్లేష్, తిరుమలేష్, వర్రె శ్రీను, అండెం రాజిరెడ్డి, మల్లయ్య, సామ పద్మారెడ్డి, శైలజ, అనిత, లక్ష్మీ, మెట్టు జానమ్మ, విద్యాసాగర్, శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండల కేంద్రంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ మహేంద్రనాథ్ , కంచర్ల చలపతిరెడ్డి, కడారి సైదులు, కుకునూరి వెంకట్ రెడ్డి, బాబు మహాజన్, జగన్ పాల్గొన్నారు.

రామన్నపేట : మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామియాదవ్, లక్ష్మీనారాయణ, జెట్టి శివప్రసాద్, చిన్నపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరిని దర్శించుకున్న ఐఏఎస్ సురేంద్రమోహన్


పూజలు చేస్తున్న ఐఏఎస్ అధికారి సురేంద్రమోహన్ కుటుంబ సభ్యులు

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రాన్ని సోమవారం ఇండికేట్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి సురేంద్రమోహన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు అయనకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కొండంగికి అంత్యక్రియలు

రాజాపేట : మండలంలోని బసంతపురం గ్రామంలో సోమవారం మృతి చెందిన కొండంగికి గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. కొండంగికి హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమయాత్ర నిర్వహించి ఖననం చేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం అందజేత

మోటకొండూర్: మండలంలోని చాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు సోమవారం యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు శోభ, లలిత, మౌనిక, సుకన్య, వైష్ణవి, అంజలి తదితరులు ఉన్నారు.

ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన

రాజాపేట : మండలంలోని పాముకుంట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన ఆహారం కోసం చిట్కాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా వర్చువల్‌గా డాక్టర్ ప్రదీప్ స్క్రీన్ ద్వారా అనేక అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆహారపు అలవాట్లపై క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజీడీ జిల్లా కో ఆర్డీనేటర్ ప్రవీణ్, మండల విద్యాధికారి చందా రమేష్, ఇన్‌చార్జ్ సత్యానంద్ పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

మోత్కూరు : కంది పంటలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని రాష్ట్ర విత్తన సేంద్రీయ ధృవీకరణ అధికారి పి.రామకృష్ణ, విత్తన ధృవీకరణ అధికారి ఎం.శివకుమార్ అన్నారు. మోత్కూరు మున్సిపాల్టి పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో రైతులు బిళ్లపాటి గోవర్ధన్‌రెడ్డి, కె.భిక్షం రెడ్డి సాగు చేసిన కంది చేనును సోమవారం పరిశీలించారు. పంటల జన్యు స్వచ్ఛతను కాపాడేందుకు పంట కోత సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. వారి వెంట పలువురు రైతులు పాల్గొన్నారు.


కంది పంటను పరిశీలిస్తున్న అధికారులు

మాజీ సర్పంచ్‌ల అరెస్టు

ఆత్మకూరు(ఎం): గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కూరెళ్ల మాజీ సర్పంచ్ భాషబోయిన ఉప్పలయ్య యాదవ్, పారుపల్లి మాజీ సర్పంచ్ లగ్గాని రమేష్ గౌడ్, కొరటికల్ మాజీ సర్పంచ్ కోల సత్తయ్య, పల్లెర్ల మాజీ సర్పంచ్ నాయిని నర్సింహ రెడ్డి, మొరిపిరాల మాజీ సర్పంచ్ సామ తిరుమల రెడ్డి తదతరులు ఉన్నారు.

వలిగొండ : పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు సోమవారం తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. చిత్తాపురం మాజీ సర్పంచ్ ఏనుగు అంజిరెడ్డి, వర్కట్‌పల్లి మాజీ సర్పంచ్ మీసాల శేఖర్, లింగరాజుపల్లి మాజీ సర్పంచ్ బొడ్డుపల్లి ఉమాకృష్ణలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుర్‌పై వదిలిపెట్టారు.

ఇళ్ల సర్వేలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలి

భువనగిరి : ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలి కోరుతూ మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 1, 6, 8వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నేటికీ ప్రారంభం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉడుత రమేష్, సిరపంగ నాగరాజు,గోపే శివ, ఇస్తేకర్, నిర్మల, కమలమ్మ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సతీష్, మాజీ ఎంపీపీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు కొయ్యడ సైదులు, ఎండి.బాబాషరీఫ్, మాజీ సర్పంచ్‌లు పబ్బు రాజు, పాశం సంజయ్‌బాబు, ఇంద్రసేనారెడ్డి, గుండెబోయిన రవికుమార్, పాశం శ్రీను, గణేష్, యాదయ్య, మహేష్, ఐలయ్య, యాదిరెడ్డి, బాలరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వలిగొండ : మండలంలోని వెల్వర్తికి చెందిన ఎడవెల్లి నగేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మండలంలోని పహిల్వాన్ పురం గ్రామానికి చెందిన చెందిన ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సోమవారం బాధితుడిని పరామర్శించారు. అనంతరం రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పలువురు గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.